క్లుప్తంగా

పరీక్ష కేంద్రం పరిశీలన

పామర్రు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష గదుల్లో విద్యుత్ ఫ్యాను సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షల చీఫ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంగ్లిష్ సెట్–1 పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 310 మందికి 300 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కేంద్రానికి స్క్వాడ్‌గా డీఈసీ–1 స్పెషల్ ఆఫీసర్ అరుణ ప్రభ వ్యవహరించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



పామర్రు: గంగానమ్మ జాతర రెండో రోజు మంగళవారం ఘనంగా జరిగింది. పోతురాజు గడ, అమ్మవారి ఘటం కుండలను గ్రామ పురవీధుల వెంబడి ఊరేగించారు. గ్రామంలోని గుడివాడ రోడ్డు, ఫైర్ స్టేషన్ బజారు, జమ్మిచెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారిని ఊరేగించారు. తదుపరి అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, నందిపాటి బాల సుబ్రమణ్యేశ్వరరెడ్డి, బొమ్మారెడ్డి రాజేష్‌రెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, గుజవర్తి శేఖర్‌రెడ్డి, మున్నంగి శ్రీనివాసరెడ్డి, బాల వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

7న సబ్ జూనియర్ సెలక్షన్స్

మొవ్వ: స్థానిక పీఎం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఈ నెల 7వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లాల సబ్ జూనియర్ బాల బాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల పీడీ అప్పికట్ల రామారావు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు తమ ఆధార్ కార్డుతో వచ్చి రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. 30/03/2009 తరువాత జన్మించి 55 కేజీల లోపు గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 97040 63555లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు అభినందన



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో జరిగిన ఎలక్యూషన్, వ్యాసరచన పోటీల్లో త్రివేణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని స్కూల్ డైరెక్టర్ ఎస్. శివ శంకర్ తెలిపారు. మంగళవారం ప్రతిభను సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు దివ్యశ్రీ, వి. సాయిస్నేహ వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీల్లో ప్రథమ బహుమతులు సాధించారని తెలిపారు. విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక బహుమతులు అందజేశారు.

వీకేఆర్ ఫెస్ట్–2025కు విశేష స్పందన



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బి అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన వీకేఆర్ ఫెస్ట్–2025కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని లియో గ్లోబల్ ఓవర్‌సిస్ క్లెంట్ రిలేషన్ షిప్ మేనేజర్ జి. అబ్బయ్య చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కళాశాల సెక్రటరీ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

వివాదాల్లో కైకలూరు పంచాయతీ

గ్రామాభివృద్ధిపై ప్రభావం



కైకలూరు పంచాయతీ కార్యాలయం

కైకలూరు: కైకలూరు పంచాయతీ కయ్యాలమయంగా మారింది. ఎంతో ఘన చరిత్ర కలిగిన పంచాయతీ వివాదాల్లో చిక్కుకుంది. ఈ ప్రభావం గ్రామాభివృద్ధిపై పడుతోంది. కైకలూరులో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. జనాభా 27 వేలకు పైగా ఉన్నారు. పంచాయతీ ఏడాది వార్షిక ఆదాయం రూ.కోటీ 96 లక్షలుగా ఉంది. వైఎస్సార్ సీపీ మద్దతుతో 2021లో పంచాయతీ సర్పంచ్‌గా విజయం సాధించిన దానం మేరీ నవరత్నకుమారి ఇటీవల జరిగిన ఎన్నికల ముందు కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో వార్డు సభ్యులు, సర్పంచ్ మధ్య పెద్ద వార్ నడుస్తోంది. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీపీఓ, డీఎల్‌పీఓ స్థాయి అధికారులు పలు పర్యాయాలు విచారణ చేశారు. వార్డు సభ్యులు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ మేరీ నవరత్నకుమారి తాను దళిత సర్పంచ్ కారణంగానే వేధిస్తున్నారని మీడియా ద్వారా గోడు వెళ్లబోసుకున్నారు. ఇబ్బందులు పెడుతున్న వార్డు సభ్యులకు కోర్టు ద్వారా నోటీసులు సైతం పంపించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు సర్పంచ్ చెక్ పవర్ రద్దయింది. సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య సయోధ్య కుదర్చటంలో కూటమి నేతలు విఫలమయ్యారు.

వార్డు సభ్యుల రాజీనామాలు

కైకలూరు పంచాయతీలో 20 వార్డులు ఉంటే ఉప సర్పంచ్‌తో సహా, మరొకరు మృతి చెందారు. మిగిలిన 18 మంది వార్డు సభ్యులలో 12 మంది సర్పంచ్ పద్ధతి నచ్చలేదని ఏకంగా రాజీనామాలు చేశారు. ఇదిలా ఉంటే కైకలూరు పంచాయతీకి ఈఓగా ప్రత్తిపాటి ఆనంద భూషణం బదిలీపై వచ్చారు. తన గది విషయంలో సర్పంచ్, ఈఓకు మధ్య విభేదాలు వచ్చాయి. తన కుర్చీ తీసివేశారని ఈఓ కొన్ని రోజులు నిరసన తెలుపుతూ ఆరు బయట విధులు నిర్వహించారు. సర్పంచ్‌పై చివరకు పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది సైతం కైకలూరు వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు రూ.కోటి పంచాయతీ నుంచి చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయడం లేదు. సుమారు 40 సంవత్సరాల క్రితం వేసిన పైపులైన్లు పాడయ్యాయి.

1934లో ఏర్పాటు

కైకలూరు పంచాయతీ 1934లో ఏర్పడింది. మొదటి సర్పంచ్‌గా మహ్మద్ గాలీబ్ సాహెబ్ వ్యవహరించారు. తర్వాత లక్కింశెట్టి శేషావతారం, మహ్మద్ అబ్దుల్లా, వేంపాటి వెంకటేశ్వరరావు, తెంటు సత్యనారాయణ, మహమ్మద్ సమీఉల్లా, గిరి వెంకటేశ్వరరావు(ఉప సర్పంచ్), బంకు జగన్నాథం, తెంటు సత్యనారాయణ, గొట్టాపు దక్షిణామూర్తి, మలిశెట్టి సత్యనారాయణ(ఉప సర్పంచ్), తెంటు నాగేశ్వరరావు, శీర సత్యవతి, దూలం నాగేశ్వరరావు, నర్సిపల్లి అప్పారావులు సర్పంచ్‌లుగా ఉన్నారు.

న్యాయపోరాటం చేస్తా



కైకలూరు పంచాయతీకి ఘనమైన చరిత్ర ఉంది. పంచాయతీలో జరిగే అవకతవకలపై 1980 నుంచి పోరాడుతున్నా. అనేక సమస్యలను కోర్టుల దృష్టికి తీసుకెళ్లాను. ప్రస్తుత పరిస్థితుల్లో కైకలూరులో అనేక సమస్యలు ఉన్నాయి. డ్రెయిన్లు, పైపులైన్లను మార్చాలి. త్వరలో పంచాయతీ సమస్యలపై న్యాయ పోరాటం చేస్తా. – వేంపాటి విష్ణురావు, బీజేపీ నేత, కైకలూరు

అభివృద్ధిపై దృష్టి



కైకలూరు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. కై కలూరు పంచాయతీ నుంచి పైపులైన్లు ఏలూరు రోడ్‌లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి వెళ్లాయి. దీంతో చెరువుల్లో నీటి నిల్వను మరింత పెంచాల్సి ఉంది. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సిబ్బందికి సూచనలు అందిస్తున్నాం. – ఆర్.ఫణింద్ర, ఎంపీడీఓ, కైకలూరు

మహిళలకు రక్షణ కల్పించడమే ప్రధానం



విద్యార్థినులతో శక్తి టీం

గుడ్లవల్లేరు: మహిళలకు రక్షణ కల్పించడంపై అవగాహన కల్పించడమే శక్తి టీముల ప్రధాన ఉద్దేశమని ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శక్తి టీముకు చెందిన మహిళా కానిస్టేబుళ్లు అవగాహన కల్పించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనన్య సామాన్యమైనదన్నారు. మహిళలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ ఉపయోగించాలన్నారు. అనవసరమైన షేరింగ్‌ను నివారించాలన్నారు. మహిళలు ఆన్‌లైన్ వేధింపులకు గురైతే భయపడకుండా అధికారులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.



జుజ్జువరంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్

సైబర్ క్రైమ్‌పై అవగాహన

జుజ్జువరం(పామర్రు): సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు మండలం జుజ్జువరంలోని ఉషోదయ హైస్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులతో ట్రాన్సాక్షన్ చేయవద్దన్నారు. అనవసరమైన క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేయవద్దన్నారు. ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ పాల్గొన్నారు.

వల్లూరుపాలెం పీఏసీఎస్‌లో డిజిటల్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

తోట్లవల్లూరు: వల్లూరుపాలెం పీఏసీఎస్‌లో ఈ ఫ్యాక్స్ ద్వారా డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు జిల్లా సహకార అధికారి కే చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో మంగళవారం మండల పరిధిలోని పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణపై ఆయన సమీక్ష నిర్వహించారు. వల్లూరుపాలెం పీఏసీఎస్ మైగ్రేషన్ టీమ్ ద్వారా క్లోజర్ సర్టిఫికెట్ పూర్తి చేసుకుని, మాన్యువల్ రికార్డుల నుంచి ఈ ఫ్యాక్స్‌లోకి మారిందని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నేటి నుంచి డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ వేగవంతం చేయాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దాసరి అలంకార్, సహకార యూనియన్ విద్యాధికారి భోజరంగరాజు, కేడీసీసీ సూపర్‌వైజర్ శివనాగరాజు, సొసైటీ సీఈఓ తోట బాలకృష్ణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ టీములు ఎస్‌ఆర్‌ఎంఏపీ యూనివర్సిటీలో ఫిబ్రవరి 27, 28, మార్చి ఒకటో తేదీల్లో నిర్వహించిన నేషనల్ లెవల్ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో మహిళల వాలీబాల్, కబడ్డీలో ప్రథమ స్థానం, పురుషుల మహిళల కంబైన్డ్ చెస్‌లో ప్రథమం, పురుషుల కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే హైదరాబాద్ జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో నిర్వహించిన నేషనల్ ఫెస్ట్‌లో మహిళల ఖోఖో విభాగంలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. విజేతలకు, శిక్షణ ఇచ్చిన కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎం.శివ శంకర్, జి. వెంకటేష్, డి.పూజితను వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి.కోదండ రామారావు, డా.ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి తదితరులు అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



కలిదిండిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏడీ వెంకటమణి

కైకలూరు: ఎరువుల, పురుగుమందుల దుకాణదారులు నిబంధనలు పాటించి విక్రయాలు చేయాలని మండవల్లి మండల వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.వెంకటమణి అన్నారు. కలిదిండిలో మారుతీ రామ ట్రేడర్స్, మస్తాన్‌బాబు ఫెర్టిలైజర్స్, లక్ష్మీగణపతి ట్రేడర్స్, సొసైటీ ఫెర్టిలైజర్స్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. వీటిలో ఫామ్ 'ఓ' గడువు ముగిసిన మారుతీరామ ట్రేడర్స్‌లో రూ. 6లక్షలు విలువ చేసే జింక్ ఎరువులు, ఇదే సమస్యపై మస్తాన్‌బాబా ఫెర్టిలైజర్స్‌లో రూ.45వేలు విలువ కలిగిన పొటాష్ అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్లు ఏడీ చెప్పారు. ఏఓ కె.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

కోనేరుసెంటర్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని డీఎల్‌పీఓ సీతారామయ్య పేర్కొన్నారు. మండలంలోని అరిసేపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు, పారిశుద్ధ్య కార్మికుల (క్లాప్ మిత్ర)కు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారామయ్య మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణ, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. అలాగే గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, దాని నిర్వహణలో అవలంభించాల్సిన పద్ధతులు, వర్మీ కంపోస్ట్ తయారు చేయు విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం కళాజాతం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్లాప్ మిత్రలను సత్కరించారు. మచిలీపట్నం ఈఓపీఆర్డీ ఎ. బాలకృష్ణారావు, ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రసంగిస్తున్న శిశు సంక్షేమ శాఖ పీడీ ఎమ్.ఎన్.రాణి

గుడివాడ టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాతా శిశు సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్.ఎన్. రాణి అన్నారు. మంగళవారం స్థానిక కైకాల సత్యనారాయణ మున్సిపల్ హాల్లో మహిళా దినోత్సవం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ శక్తిని సమాజం గుర్తించాలన్నారు. కుటుంబంలో స్త్రీ యొక్క పాత్ర ఎంతో గొప్పదన్నారు. స్త్రీ అన్ని రంగాల్లో ముందుండాలని, అందుకు తాము అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయా ఫ్లారెన్స్, డీసీపీఓ మోనీషా, ఏసీడీపీఓ పద్మావతి, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఖోఖో పోటీలకు గుడివాడ విద్యార్థులు



సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుడివాడ టౌన్: గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సౌత్ జోన్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్, అండ్ హిల్ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఈ జట్టు మే నెలలో జరిగే సౌత్‌జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, అభినందించారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

గుడివాడరూరల్: పట్టణంలోని పలు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని గుడ్‌మన్‌పేటలో ఉన్న షాపు నంబరు–5లో ఉండాల్సిన సరుకు కన్నా 12 క్వింటాళ్లు ఎక్కువ ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అదేవిధంగా ముబారక్ సెంటర్‌లోని షాపు నంబరు–2లో కూడా ఉండాల్సిన రేషన్ కన్నా 20 క్వింటాళ్లు ఎక్కువ ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఎన్టీఆర్ కాలనీలోని షాపు నంబరు–16లో 9క్వింటాళ్లు ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. స్లేడర్‌పేటలోని షాపు నంబరు–26లో ఉండాల్సిన రేషన్ సరుకు కన్నా 30 క్వింటాళ్లు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. వీరందరిపై 6ఎ కేసు నమోదు చేశారు. బేతవోలులో గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 1900 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 6ఎ కేసు, క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు గుడివాడ పీడీఎస్ డీటీ కిరణ్ తెలిపారు. విజిలెన్స్ సీఐ ఉమర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాములు సేవలను మరువలేం

తోట్లవల్లూరు: మర్రెడ్డి శ్రీరాములు పోరాట స్ఫూర్తిని, ప్రజలకు చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. మండలంలోని యాకమూరులో శ్రీరాములు ఐదో వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. శ్రీరాములు చిత్రపటానికి నరసింహారావు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ గాదె కనకదుర్గ ప్రారంభించారు. కుమ్మమూరు సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బి. రోజారాణి, సీపీఎం నాయకులు ఎం. హరిబాబు, కే. శివనాగేంద్రం, కే. కొండలబాబు, బుల్లయ్య, కేవైకే రెడ్డి, పడాల లక్ష్మణరావు, విశ్వమోహన్ పాల్గొన్నారు.

రహదారులను ధ్వంసం చేస్తున్న మట్టి టిప్పర్లు



కైకలూరు: భారీ మట్టి టిప్పర్ల కారణంగా రహదారులు పాడవుతున్నాయని మండలంలోని వదర్లపాడు, శీతనపల్లి ప్రజలు కై కలూరు తహసీల్దారు కార్యాలయ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల శీతనపల్లి పుంత నుంచి సుమారు 100 టిప్పర్లు రాత్రి, పగలు తేడా లేకుండా తిరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో రహదారులు పూర్తిగా పాడువతున్నాయన్నారు. తక్షణం టిప్పర్లను నిలుపుదల చేయాలని కోరారు.

వైభవంగా గోపూజ



మండవల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ షిర్డీసాయి సంకీర్తనా మందిరంలో ఫిబ్రవరి 17న స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించిన నేపథ్యంలో మంగళవారం 16 రోజుల పండుగ సందర్భంగా నిర్వాహకులు శ్రీరామఫణికుమార్ పర్యవేక్షణలో గోపూజ జరిపారు. ఈ సందర్భంగా భక్తులు మొలకలను గోవుకు ఆహారంగా పెట్టారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మురంగా సాగుతున్నాయి. 25 గ్రామాలకు గాను 23 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. మంగళవారం 23 గ్రామాల్లో 43 పనులు జరిగాయని, 1,326 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారని ఏపీఓ లక్ష్మీరెడ్డి తెలిపారు. పంటకాలువల పూడికతీత పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

విద్యతో గుర్తింపు

ముదినేపల్లి రూరల్: విద్యతోనే సమాజంలో ప్రతిఒక్కరికీ గుర్తింపు దక్కుతుందని పూర్వవిద్యార్థులు అన్నారు. మండలంలోని గురజ జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థి ఎన్నార్‌ఐ డాక్టర్ యర్నేని వెంకటకిరణ్‌కుమార్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమోహనరావు, యలవంచి నాగేశ్వరరావు, ఏజే ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పోటీల్లో అల్లూరు విద్యార్థుల ప్రతిభ

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు హైస్కూల్ విద్యార్థులు సబ్‌జోన్ సెంట్రల్‌జోన్ క్రీడల పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు హెచ్‌ఎం శొంఠి రామోజీ తెలిపారు. కైకలూరు సబ్‌జోన్ బాలికల పోటీల్లో హైస్కూల్ జట్టు ఖోఖో, త్రోబాల్‌లో విన్నర్లుగా కబడ్డీ పోటీల్లో రన్నర్లుగా గెలిచినట్లు చెప్పారు. ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో త్రోబాల్‌లో విన్నర్లుగా ఖోఖోలో రన్నర్లుగా నిలిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చినట్లు తెలిపారు. హైస్కూల్ పీడీ వెంకటేశ్వరరావు ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోకుమూడి భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ

మండవల్లి: మండలంలోని లోకుమూడి హైస్కూల్లోని భవిత సెంటర్‌లో మంగళవారం ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ప్రత్యేక అవసరాలు ఉన్న ఏడుగురు చిన్నారులకు చికిత్సలు చేశారు. రోజూ చిన్నారులకు వారి ఇళ్లవద్ద ఉదయం, సాయంత్రం ఆయిల్ రాసి క్యాంప్‌లో మాదిరిగా వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ సుఫియాన్, ఐఈఆర్‌టీలు టి.అరుణకుమారి, పి.వసంత, జీవీ శైలజ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర జీవితం

కైకలూరు: క్రమం తప్పకుండా మహిళలు తీసుకునే పోషకాహారంతో ఆరోగ్యకర జీవితం ఏర్పడుతోందని కైకలూరు ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ వి.దీప్తి చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటపాక అంగన్‌వాడీ కేంద్రం–1లో హెల్దీ ఉమెన్, హ్యాపీ ఉమెన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఎ.విజిత పాల్గొన్నారు.